క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లోని బాలాజీనగర్ ఫీడర్ 11 కేవీ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, శ్రీహరినగర్, కై లాసనగర్, బాలాజీనగర్, ముస్తఫా కాలనీ, అన్నానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఏయూ వీసీకి పితృవియోగం



బలరామకృష్ణ (ఫైల్)

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బలరామకృష్ణ(81) అనారోగ్యకారణంగా రెండు రోజులుగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి పరమపదించారు. బలరామకృష్ణ భౌతిక కాయాన్ని ఏయూ రిజిస్ట్రార్ ధనంజయరావు, క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, డీన్లు, ఆచార్యులు సందర్శించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వీసీ రాజశేఖర్‌ను పరామర్శించారు. సింహాచలంలోని వీసీ స్వగృహం నుంచి అంతిమ యాత్ర చేసి, గోపాలపట్నం శ్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహిస్తారు.

మంగరాజురెడ్డి మృతికి సీపీఐ సంతాపం



బోర మంగరాజురెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మద్దిలపాలెం: సీపీఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ బోర మంగరాజురెడ్డి అనారోగ్యంతో గురువారం రాత్రి మద్దిలపాలెంలోని తన స్వగృహంలో మరణించారు. అతడి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం సీపీఐ ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించించారు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న రోజుల్లో పట్టుదలగా పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తూ మద్దిలపాలెం ఏరియాలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే వారని నాయకులు కొనియాడారు. మంగరాజురెడ్డి 8 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచాడని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ రాష్ట్ర సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యుడు ఎన్.నాగభూషణం, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్, పైల ఈశ్వరరావు, సిహెచ్.కాసుబాబు, డి.సత్తిబాబు తదితరులున్నారు.

ప్రధాన రహదారిపై చెత్త



శివాజీపాలెం రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలోని రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. ఈ ప్రాంతంలోకి మూడు రోజులుగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో స్థానికులు ప్రధాన రోడ్డు మీదే చెత్త వేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో నడుచుకుంటూ వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. దుర్వాసనతో ఉండలేకపోతున్నామని చుట్టుపక్కల నివాసులు వాపోతున్నారు. పారిశుధ్య అధికారులు స్పందించి తక్షణమే చెత్త తొలగించాలని వేడుకుంటున్నారు.

కేరింత

- కాలనీ పార్కుల్లో సమ్మర్ సందడి
- చిన్నారుల ఆటపాటలతో కళకళ
- వ్యాయామాలతో పెద్దలు బిజీ



ఏపీజీవో కాలనీలో పార్కులో చిన్నారుల సందడి



ఊయల ఊగుతున్న చిన్నారులు

మద్దిలపాలెం: వేసవి సెలవులను చిన్నారులంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఎంజాయ్ చేస్తున్నారు. పిల్లల కేరింతలు, ఆటపాటల సందడితో స్థానిక పార్కులన్నీ కళకళలాడుతున్నాయి. జీవీఎంసీ 15, 16 వార్డుల్లోని పార్కుల్లో చిన్నారుల కోసం అనేక రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. పెద్దల వ్యాయమానికి కావాల్సిన జిమ్ పరికరాలను అమర్చారు. వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. షటిల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా పార్కులన్నీ పిల్లల ఆటపాటలకు వేదికగా.. పెద్దల ఆరోగ్య పరిరక్షణకు బాసటగా నిలుస్తున్నాయి.

ఆరోగ్య పరిరక్షణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లను ఆధునీకరించిన విషయం తెలిసిందే. నేడు ఇవి ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఎందరో మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువకులు ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. గతంలో వాకింగ్ చేయాలంటే వాకర్లు ఎంతో ఇబ్బంది పడేవారు. రోడ్డు మీద నడిస్తే ప్రమాదకర పరిస్థితి ఎదురవుతుందేమోనని భయపడేవారు. ఇప్పుడు ఎంచక్కగా కాలనీ మధ్యలోని పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లుండటంతో ఎంతో ఉత్సాహంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు.

ఆకట్టుకునేలా ఆట పరికరాలు

చిన్నారులను ఆకట్టుకునేలా పార్కుల్లో అన్ని రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వ్యాయామానికి అనుగుణంగా పరికరాలను అమర్చారు. పిల్లలు ఎంచక్కగా వాటిని వినియోగించుకుంటూ ఇటు ఆటల్లో నైపుణ్యం పొందుతూ.. అటు ఆరోగ్యానికి పదిలం చేసుకుంటున్నారు. వేసవి సెలవుల కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో పార్కులు దర్శనమిస్తున్నాయి. 16వ వార్డులోని ఏపీజీవో కాలనీ పార్కు, విద్యానగర్ పార్కుల్లో చిన్నాపెద్దల సందడితో నిత్యం కనిపిస్తోంది. ఈ పార్కులపై కాలనీ అసోసియేషన్ దృష్టి సారించి.. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటే చాలా కాలం వరకు ఆట, జిమ్ పరికరాలు అందుబాటులో ఉంటాయని పలువురు చెబుతున్నారు.



విద్యానగర్ కాలనీ పార్కులోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళలు

ఓపెన్ జిమ్‌తో ఎంతో ఉపయోగం

కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రత్యేకించి వేల రూపాయలు ఖర్చు చేసి జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. సమయం, డబ్బు వృథా కాకుండా ఇంటి దగ్గరలోనే జిమ్ ఉన్న ఫీల్ ఉంది.

– కె.వి.ఎస్.ప్రసాద్, విద్యా నగర్

ఇంటి చెంతనే వ్యాయామం, వాకింగ్

గతంలో వాకింగ్ కోసం చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇంటి చెంతనే గల కాలనీ పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడంతో క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ చేస్తున్నాను. కాలనీ పార్కులను ఆధునికీకరించి గత ప్రభుత్వం చాలా మంచి పనిచేసింది.

– ఎన్.నిర్మల, భానునగర్ కాలనీ

పౌష్టికాహారంపై బాలికలకు అవగాహన



ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సెల్వియా



కేఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న కార్యకర్త

ఆరిలోవ: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 12వ వార్డు ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సెల్వియా మాట్లాడుతూ కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, అన్నపూర్ణ, మహిళా పోలీస్, స్థానిక కిశోర బాలికలు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: కిశోర బాలికలు రక్తహీతనపై అవగాహన కలిగి ఉండాలని కేఆర్‌ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి సూచించారు. సీడీపీవో ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో తమ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. రక్తహీనత నివారణకు అన్ని రకాల పోషకాహారం, ఐరన్ టాబెట్లు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బాలికల్లో సందేహాలను తెలుసుకుని నివృత్తి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

18న తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన

మద్దిలపాలెం: తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ ప్రదర్శన, 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీల బహుమతి ప్రదానోత్సవాన్ని ఈ నెల 18న కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి వై.ఎస్.కె.ఎన్. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత'అనే నాటిక 50వ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది నిర్వహించిన 14వ జాతీయ స్థాయి తెలుగు నాటిక రచనల పోటీలకు విశేష స్పందన వచ్చిందని.. ఉత్తమ రచనగా 'రిక్వెస్ట్', ద్వితీయ ఉత్తమ రచనగా 'క్రతువు', తృతీయ ఉత్తమ రచనగా 'మూగబోయిన సాక్ష్యం'ఎంపికైనట్లు వెల్లడించారు. 'విష కుంభం', 'భుని కోరని భ్రమణం'నాటికలు జూరీ బహుమతులు గెలుచుకున్నట్లు చెప్పారు. తెలుగు నాటకరంగ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై.. బహుమతి ప్రదానోత్సవంతో పాటు కళాకారులు జ్ఞాపికలు ప్రదానం చేస్తామన్నారు. రావులపాలేనికి చెందిన డాక్టర్ గొలుగూరి విక్టరీ వెంకట్ రెడ్డికి ప్రత్యేక పురస్కారం అందజేస్తామని స్వామి వివరించారు.

శిథిలమైన పాత్‌వే..



దీన్‌దయాల్‌పురం వద్ద దెబ్బతిన్న ప్రభుత్వ బాలుర గృహానికి వెళ్లే పాత్‌వే

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారి పాత్‌వేలు శిథిలమవుతున్నాయి. సంజయ్‌గాంధీ కాలనీ నుంచి పెదగదిలి, చినగదిలి మీదుగా దీన్‌దయాల్‌పురం వరకు పలుచోట్ల పాత్‌వేలపై పలకలు ఊడిపోయాయి. కొన్నిచోట్ల అంచులు విరిగిపోయాయి. జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర గృహానికి వెళ్లే రహదారి వద్ద పాత్‌వే పూర్తిగా పాడైంది. ప్రభుత్వ బాలుర గృహాలతోపాటు జీవీఎంసీ నిర్వహిస్తున్న వీధి కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స కేంద్రం, జీవీఎంసీ పశువుల సంరక్షణ(బందెల దొడ్డి) శాలకు వెళ్లే రహదారి కూడా ఇదే. దీంతో ఆయా వాటిని తీసుకెళ్లే వ్యాన్‌లు నిత్యం తిరుగుతుండటంతో ఈ పాత్‌వే శిథిలమైంది. దీనిపై ప్రభుత్వ బాలుర గృహాలకు వెళ్లే ఉద్యోగులతోపాటు బాలురను చూసేందుకు వెళ్లేవారి తల్లిదండ్రులు, బంధువులకు ఇబ్బందిగా మారింది. కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని బాలుర గృహాల్లో బంధువులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పాత్‌వేలకు మరమ్మతులు జరిపించాలని కోరుతున్నారు.

బీపీ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి

ఎంవీపీకాలనీ: బీపీ వ్యాధిగ్రస్తులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశ్విన్‌కుమార్ సూచించారు. ప్రపంచ బీపీ డేను పురస్కరించుకొని వెంకోజీపాలెం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల్లో దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. అందులో బీపీ ప్రధానమైనదని చెప్పారు. బీపీ వ్యాధిగ్రస్తులు అప్రమత్తతతోనే దాన్ని నియంత్రించు కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. లేనిపక్షంలో గుండెపోటు, మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో వ్యాధిగ్రస్తులు అవసరమైన ఔషధాలు వాడటంతోపాటు మద్యపానం, ధూమపానాకి దూరంగా ఉండాలని, ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. తలనొప్పి, ఛాతి నొప్పి, తల తిరగడం, వికారం, వాంతులు వంటి లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించి, బీపీ చెక్ చేయించుకోవడంతో పాటు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నడక, పరుగు, ఈత, వ్యాయామాలు వంటివి బీపీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగు పడేందుకు ఎంతగానో సహకరిస్తాయని వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

డీసీపీవో నియామకంపై నిర్లక్ష్యం..!

ఐదు నెలలైనా స్పందించని యంత్రాంగం



ఎంవీపీకాలనీ: డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో) నియామకంపై జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం చేయడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ వేదికగా ఉన్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమక్షంలో జిల్లా అధికారిగా డీసీపీవో సేవలు అందించాల్సి ఉంటుంది. అనాథ పిల్లల సంరక్షణ, బాల్య వివాహాలు నిర్మూలన, కిశోర బాలికల ప్రగతి, చైల్డ్ లైన్ విధులు సహా అనేక సేవలు అందించడంలో డీసీపీవో పాత్ర కీలకం. జనాభా పరంగా రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖ జిల్లాకు ఐదు నెలలుగా డీసీపీవోను నియమించకపోవడం జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. విశాఖ కంటే తక్కువ జనాభ కలిగిన అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు డీసీపీవోలు ఉండగా.. విశాఖకు లేకపోవడంపై అనేక ఎన్జీవోలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. నిత్యం బాలలకు సంబంధించి అనేక ఘటనలు విశాఖలో చోటుచేసుకునే పరిస్థితి ఉండగా.. డీసీపీవో పరిధిలోని యంత్రాంగం సేవలు చాలా కీలకం. అయినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు ఈ నియామకం చేపట్టడంలో ఉదాసీనంగా వ్యవహరించడంపై పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. గతంలో ఇక్కడ డీసీపీవోగా సేవలందించిన బి.లక్ష్మి గత జనవరిలో విజయనగరానికి బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి విశాఖ జిల్లా డీసీపీవో పోస్ట్ ఖాళీగా ఉండటంతో పిల్లలకు అందించే సేవల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సగం.. సగం పనులు

బీచ్ రోడ్డులో మొక్కుబడిగా ఫుట్‌పాత్‌ల మరమ్మతులు



బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్ మీద పైకి లేచిన గ్రానైట్ పలకలు



ఫుట్‌పాత్‌పై ఊడిపోతున్న గ్రానైట్ పలకలు

ఏయూక్యాంపస్: అభివృద్ధి పేరిట జరిపే ఏ పనైనా సమగ్రంగా చేయాలి. సగం.. సగం పనులు చేస్తే ప్రయోజనం శూన్యం. బీచ్ రోడ్డులో చేపడుతున్న పనులే ఇందుకు నిదర్శనం. ఇక్కడి ఫుట్‌పాత్‌లకు కొన్ని రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. ఇవి కేవలం మొక్కుబడిగా సాగుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై దెబ్బతిన్న పలకలను పలు చోట్ల మార్పు చేస్తున్న అధికారులు పక్కనే పెచ్చులూడి, పైకి లేచిన గ్రానైట్ పలకలకు మరమ్మతులు చేసే దిశగా ఆలోచన చేయడం లేదు. ఒకే సమయంలో రెండు పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళిక చేసుంటే బాగుండేది. దీనిని భిన్నంగా ప్రస్తుతం ఫుట్‌పాత్ పలకలకు మాత్రమే మార్పు చేస్తున్నారు. వీటిని ఆనుకుని ఉన్న ప్రహరీ గోడకు వేసిన గ్రానైట్ పలకలను మార్పు చేసే దిశగా పనిచేయడం లేదు. సాయంత్రం వేళల్లో నిత్యం ప్రజలంతా వీటిపైనే కూర్చుంటారు. గతంలో సిమెంట్‌తో ఉండే వీటిని అందంగా గ్రానైట్ వేసి సుందరంగా తీర్చిదిద్దారు. కాలగమనంలో కొన్ని చోట్ల ఇవి విరిగిపోవడం, పైకి లేవడం, సిమెంట్ ఊడిపోయి పలకలకు వేరు పడటం వంటివి జరుగుతున్నాయి. ప్రస్తుతం జరుపుతున్న మరమ్మతులతోపాటు వీటిని కూడా పూర్తి స్థాయిలో బాగుచేస్తే మంచిది. లేని పక్షంలో ఇవి మరింత శిథిలమై పూర్తిస్థాయిలో మార్చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అది ఆర్థికంగా కూడా భారమవుతుంది. ఈ దిశగా జీవీఎంసీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

రోడ్డుపై వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

ఏయూక్యాంపస్: రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈస్ట్ పాయింట్ కాలనీలోని స్టేట్ బ్యాంక్ పక్కనే ఉన్న గెడ్డలో వ్యర్థాలను తీసి అక్కడే వదిలేయడంతో స్థానికులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'రోడ్డుపై వ్యర్థాల కుప్ప' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు స్పందించిన పారిశుధ్య విభాగం సిబ్బంది వెంటనే వ్యర్థాలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



వ్యర్థాలు తొలగించడంతో పరిశుభ్రంగా రహదారి

మామిడి పంట ఆదాయంలో హెచ్చుతగ్గులు



విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి తోట

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మామిడి పంట ద్వారా వచ్చే ఆదాయంలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఒక ఏడాది పంట దిగుబడి బాగుంటే.. మరుసటి ఏడాది పంట తగ్గిపోతోంది. పంట దిగుబడిలో మార్పుల వల్ల జైలుకు వచ్చే ఆదాయంలో కూడా హెచ్చు తగ్గులు వస్తున్నాయి. జైలు ఆవరణలో పండిన మామిడి పంటను అధికారులు ఏటా వేలం వేస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది వేలం పాట నిర్వహించగా.. ఓ వ్యాపారి రూ.1.30 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.50వేలు అధికంగా ఆదాయం లభించింది. జైలు ఆవరణలోని మామిడి తోట నుంచి 2020లో రూ.65 వేల ఆదాయం లభించగా, 2021లో రూ.1,00,200, 2022లో రూ.52వేలు, 2023లో రూ.1.40లక్షలు, 2024లో రూ.80 వేలు, 2025లో రూ.1.30లక్షలు ఆదాయం వచ్చింది. ఇలా గత ఆరేళ్లలో ఒక సంవత్సరం ఆదాయం తగ్గడం, మరుసటి సంవత్సరం పెరగడం గమనార్హం.

'సీఆర్‌ఏఎఫ్'కు పూర్తి అనుమతులివ్వాలి

మద్దిలపాలెం: రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం గతేడాది స్థాపించిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం(సీఆర్‌ఏఎఫ్) సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరచడంలో ప్రభుత్వ పూర్తి అనుమతులు జారీ చేయాలని ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనుమతులు జారీ చేసేలా దరఖాస్తు చేశామని శుక్రవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. రాష్ట్ర విద్య, స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వైద్య, ఆరోగ్య, హోం, దేవదాయ శాఖలతోపాటు మరిన్ని శాఖలకు దరఖాస్తు చేశామన్నారు. ప్రధానంగా బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ కళాశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనకు అనుమతివ్వాలని కోరారు. ఫోరం తరఫున రూపొందించించే వివిధ బాలల చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించే పోస్టర్లు, స్టిక్కర్లు, వీడియో క్లిప్పింగ్స్, ప్రసార, ప్రచార మాధ్యమాల్లోనూ, సోషల్ మీడియాలో ప్రచారం చేయనున్నామని తెలిపారు. ఈ ప్రచారాలపై కాపీరైట్ చట్టాలను అనుసరించి తక్షణ చట్ట ప్రకారం చర్యలకు ప్రత్యేక అనుమతులు కోరుతూ రాష్ట్ర హోం శాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి ప్రభుత్వ అనుమతులు రాగానే తమ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం విస్తృత స్థాయిలో పిల్లల సేవలు అందించనున్నట్టు ధనలక్ష్మి, ప్రవీణలు పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో డెంగ్యూ నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

మహారాణిపేట: పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 1964లో విశాఖలో తొలి డెంగ్యు కేసు నమోదైందన్నారు. అప్పుడు ఈ వ్యాధి దోమ ద్వారా వచ్చిన వైరస్‌గా గుర్తించి చికిత్స అందించారని తెలిపారు. జ్వర లక్షణాలను వివరించారు.. జ్వరం ఉధృతంగా రావడం, కండరాలు కీళ్ల నొప్పులు, వాంతి వచ్చినట్టుగా భ్రాంతి ఉంటుందన్నారు. నోరు ఎండిపోవడం, రక్తపోటు నమోదు చేయలేనంతగా పడిపోవడం జరుగుతాయన్నారు.

డ్రై డే పాటించాలి..

ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.రాధారాణి మాట్లాడుతూ డెంగ్యూను సకాలంలో గుర్తించి, చికిత్స అందిస్తే రోగిని కాపాడుకోవచ్చన్నారు. అలాగే వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ జ్వరాన్ని అదుపులో ఉంచవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి తులసి, జీవీఎంసీ బయోలజిస్టు జి.సాంబమూర్తి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల సందడి



ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ క్రీడాకారులతో సందడిగా మారింది. క్రీడాకారులు ఉత్సాహంగా బాస్కెట్‌బాల్‌లో మెళకువలు నేర్చుకుంటున్నా రు. నిష్ణాతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గతుకుల మయం

ప్రభుత్వ చెస్ట్ ఆస్పత్రి రోడ్లకు సుస్తీ







నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్(ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు పొందిన మొదటి ప్రభుత్వ ఆస్పత్రి అయిన పెదవాల్తేరు చెస్ట్ అండ్ సీడీ హాస్పిటల్‌లో అసౌకర్యాలకు కొదువే లేదు. రోగుల వైద్యం సంగతి పక్కన పెడితే మౌలిక వసతి కల్పనలో ఆస్పత్రి ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆస్పతిలోని అన్ని విభాగాలకు వెళ్లే రహదారులు గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. హాస్పిటల్ మొత్తం సీసీ రోడ్లు నిర్మించినా.. అవన్నీ ఇప్పుడు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. వాహనాలపై వస్తున్న రోగులకు ఈ గతుకుల రోడ్లు మరో అనారోగ్య సమస్యను తీసుకొస్తున్నాయి. ద్విచక్ర వాహన చోదకులైతే జారి పడుతున్నారు. ఇంతలా రోగులు, వారి బంధువులు ఇబ్బంది పడుతున్నా.. తమకేం పట్టనట్లు ఛాతి ఆస్పత్రి ఉన్నతాధికారుల తీరు ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ఆస్పత్రిలోని అధ్వాన రోడ్లను బాగుచేయాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

– బీచ్‌రోడ్డు